క్లుప్తంగా

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

కోవెలకుంట్ల: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని చైల్డ్‌ఫండ్ ఇండియా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఖాదర్‌బాషా పిలుపునిచ్చారు. శనివారం ఆ ప్రాజెక్టు కార్యాలయంలో సంస్థ దత్తత గ్రామాలైన వెలగటూరు, బిజనవేముల, పెద్ద కొప్పెర్ల, ముదిగేడు, సంజామల, కమలపురి, అమడాల, కొత్తపేట గ్రామాలకు చెందిన మహిళలకు 'వ్యాపార అభివృద్ధి, రుణ సేకరణ' అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించేందుకు సంస్థ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైకేపీ ఏపీఎం గురుస్వామి, సంస్థ సిబ్బంది మహేష్, ఉసేని, చెన్నయ్య పాల్గొన్నారు.

ఎన్‌టీఎఫ్ జిల్లా కార్యదర్శిగా వెంకటేష్

డోన్ టౌన్: నంద్యాల జిల్లా నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ కార్యదర్శిగా డోన్‌కు చెందిన ఎరుకల పోతురాజు వెంకటేష్‌ను నియమించినట్లు ఎన్‌టీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల రాముడు తెలిపారు. డోన్ నాయకులు ఎరుకల పోతురాజు, బాలకృష్ణ, ఎరుకల రవి, ఎరుకల శ్రీనివాసులు, ఎరుకల రఘు, ఎరుకల మాధవకృష్ణ తదితరులు వెంకటేష్‌కు అభినందనలు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జఫ్రుల్లా

బేతంచెర్ల: సీహెచ్‌సీకి వైద్యం కోసం వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది బాధ్యతగా మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్‌ఓ జఫ్రుల్లా అన్నారు. శనివారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. సీహెచ్‌సీ సూపరిండెంట్, గైనకాలజిస్టు సాగరిక ఆధ్వర్యంలో రోగులకు అందజేస్తున్న వైద్య సేవలపై డీసీహెచ్‌ఓ సమీక్ష నిర్వహించారు. డీసీహెచ్‌ఓ మాట్లాడుతూ వైద్యులు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలన్నారు.

రేపు ఆలయాల నిర్మాణానికి భూమి పూజ

కోవెలకుంట్ల: మండలంలోని లింగాల గ్రామంలో నూతన ఆలయాల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమం చేపడుతున్నట్లు సర్పంచ్ డీవీ శేషిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో వెలసిన సోమేశ్వర, చెన్నకేశవ ఆలయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వం రూ. 1. 14 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. పురాతన ఆలయాల స్థానంలో జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఆలయాల నిర్మాణ భూమి పూజకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరీ

బేతంచెర్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని బనగానపల్లె సీడీపీఓ ఉమామహేశ్వరీ, గ్రేడ్–2 పర్యవేక్షకురాలు చంద్రమ్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక అయ్యల చెర్వులోని 20వ అంగన్‌వాడీ కేంద్రంలో బాలికల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న పథకాల గురించి అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, చదువు ప్రాముఖ్యత, ఆరోగ్య సూత్రాలు తదితర విషయాలను వారు వివరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

కోవెలకుంట్ల: సంజామల మండలం నొస్సం సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రతాప్ శనివారం తెలిపారు. ఎస్‌ఐ అందించిన సమాచారం మేరకు.. నొస్సంకు చెందిన వెంకటేశ్వర్లు ఈ నెల 18న క్రిమి సంహారక మందుల కొనుగోలు నిమిత్తం బైక్‌పై కోవెలకుంట్లకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఫ్లయాస్ ట్యాంకర్ ఢీకొనడంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుడి బావమరిది వెంకటసుబ్బయ్య ఫిర్యాదు మేరకు ట్యాంకర్ డ్రైవర్ రోహిత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



తీరనున్న రహదారి సమస్య!

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టింది. ఏళ్లతరబడి కనీసం మరమ్మతులకు నోచుకోక గుంతలమయమైన రోడ్లలో రాకపోకలకు ప్రజలు పడిన ఇబ్బందులు ఒక్కొక్కటిగా తొలగిపోతున్నాయి. మండల పరిధిలోని సీతారామాపురం గ్రామానికి సీతారామాపురం మెట్ట నుంచి 3.40 కిలోమీటర్ల డబుల్ రహదారి నిర్మాణానికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో సుమారు 2.80 కోట్ల మంజూరయ్యాయి. డబుల్ రోడ్డు పనుల్లో భాగంగా కర్నూలు రహదారిలోని మెట్ట నుంచి సీతారామాపురం గ్రామంలోకి గ్రావెల్ రోడ్డు పూర్తి కావడంతో బీటీ రోడ్డు పనులను ముమ్మరంగా సాగుతున్నాయి. ఏళ్లతరబడి రాకపోకలు కష్టంగా సాగించిన ఆయా గ్రామాల ప్రజలు రోడ్డు నిర్మాణంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి బుగ్గనతోపాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు గ్రామీణులు.


ముమ్మరంగా జరుగుతున్న సీతారామాపురం డబుల్ రోడ్డు పనులు

బనగానపల్లెలో పెరిగిన ఓటర్లు

కొలిమిగుండ్ల: బనగానపల్లె నియోజకవర్గంలో 2019 సాధారణ ఎన్నికలతో పోల్చితే 6వేలకు పైగానే కొత్తగా ఓట్లు నమోదయ్యాయి. ఎన్నికల అధికారులు ఇటీవల 2023 స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు సంబంధించి తుది జాబితా విడుదల చేశారు. కొలిమిగుండ్ల, అవుకు, సంజామల, కోవెలకుంట్ల, బనగానపల్లె మండలాలు ఈ నియోజకవర్గంలో ఉన్నాయి. ప్రస్తుతం విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం నియోజకవర్గంలో 6264 మంది కొత్త ఓటర్లు నమోదయ్యారు. మొత్తం 2,39,554 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 1,18,696, మహిళలు 1,20,824 మంది ఓటర్లు ఉన్నారు. ట్రాన్స్ జెండర్లు 34 మంది ఉన్నారు. పురుషుల కంటే 2,128 మంది మహిళలు అధికంగా ఉన్నారు. 2019 ఎన్నికల సమయంలో మొత్తం ఓటర్లు 2,33,290 ఉండగా పురుషులు 1,15,581, మహిళలు 1,17,678 మంది ఉన్నారు. 2024లో జరగబోయే సాధారణ ఎన్నికల్లో సైతం మహిళా ఓటర్లే కీలక పాత్ర పోషించనున్నారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 2009లో బనగానపల్లె నియోజకవర్గం ఏర్పడింది. 2009లో నియోజకవర్గ వ్యాప్తంగా 1,91,902 మంది ఓటర్లు ఉన్నారు. 2014 ఎన్నికల వచ్చే సరికి ఓటర్ల సంఖ్య 2,16,578కు చేరింది. బనగానపల్లె నియోజకవర్గం ఏర్పడిన తర్వాత మూడు సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 47వేలకు పైగానే ఓటర్లు పెరిగారు.

మల్లన్నను దర్శించుకున్న బనగానపల్లె ఎమ్మెల్యే

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను శనివారం ఎమ్మెల్యే కాటసానిరామిరెడ్డి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయమర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరుస్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు. స్వామిఅమ్మవార్ల దర్శనం అనంతరం వీరు బయలువీరభద్రస్వామి పూజల్లో పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రాత పరీక్షకు ప్రత్యేక బస్సులు

కోవెలకుంట్ల: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆది వారం నిర్వహించే కానిస్టేబుల్ రాత పరీక్షకు కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రం నంద్యాలకు తెల్లవారుజామున ఐదు గంటల నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక సర్వీసు, అభ్యర్థుల మేరకు కర్నూలుకు కూడా ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామన్నారు. కానిస్టేబుల్ రాత పరీక్ష వెళ్లే అభ్యర్థులు బస్ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డోన్ డిపో నుంచి....

డోన్ టౌన్: పోలీసు ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం నంద్యాలకు, కర్నూలుకు డోన్ డిపో నుంచి నాలుగు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ శనివారం తెలిపారు. డోన్ కొత్త బస్టాండ్ నుంచి నంద్యాలకు ఉదయం 05.45, 06.15 గంటలకు రెండు బస్సులు, కర్నూలుకు ఉదయం 05.30, 06.30 గంటలకు రెండు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా నంద్యాలకు వెళ్లే వారికి డోన్ రెల్వే గేట్ల వద్ద నుంచి బేతంచెర్ల వరకు ప్రతి అర గంటకు బస్సు సౌకర్యం ఉందన్నారు. కర్నూలుకు ప్రతి 20 నిముషాలకు ఓ బస్సు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని పోలీసు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా పంచాక్షరి జపయజ్ఞం


పూజ సామగ్రితో యజ్ఞానికి వస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లెరూరల్: యాగంటి క్షేత్రంలో తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లాకు చెందిన జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో శనివారం పంచాక్షరీ జప యజ్ఞం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పంచాక్షరీ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ డైరెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు దాదాపు 500 మంది భక్తులు పంచాక్షరి జప యజ్ఞంలో పాల్గొన్నారు. మహేశ్వరశర్మ సిద్ధాంతి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో నిర్మిస్తున్న శ్రీ కైలాస ప్రస్తార మహా మేరు పంచముఖ ఉమామహేశ్వర దేవ స్థానం నిర్మాణం సజావుగా కొనసాగాలని పంచాక్షరీ జపయజ్ఞం నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ దొనపాటి యాగంటిరెడ్డి, నిత్యాన్నదాన సంస్థ కార్యదర్శి దస్తగిరిరెడ్డి, రామా రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి


విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈఓ శ్రీధర్

అవుకు: ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి శ్రీధర్ రావు సూచించారు. మండల పరిధిలోని గోకుల దిన్నె, వేమలపాడు పాఠశాలలను శనివారం ఎంఈఓ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వేములపాడులో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులతో ఎంఈఓ మాట్లాడారు. విద్యాబోధన ఎలా ఉంది.. ఉపాధ్యాయులు అర్థమయ్యేలా చెబుతున్నారా.. సమయానికి వస్తున్నారా .. లేదా అని ఆరా తీశారు. ఫేషియల్ అటెండెన్స్‌లో ఉపాధ్యాయులు ఉదయం 9 గంటల నుండి 9.15 నిమిషాలలోపు అటెండెన్స్ వేయాలని, లేనిపక్షంలో లేట్ కమ్మర్స్ కిందకు వస్తుందని ఈ సందర్భంగా ఎంఈఓ హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు వాణీబాయి, గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి


జగనన్న లే అవుట్‌లో ఏర్పాటు చేసిన మోటార్‌ను పరిశీలిస్తున్న ఈఈ పద్మారావు

కొలిమిగుండ్ల: జగనన్న లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ పద్మారావు సూచించారు. శనివారం కస్తూర్బా పాఠశాల సమీపంలో 544–డీ జాతీయ రహదారి చెంతనే ఏర్పాటు చేసిన కొలిమిగుండ్ల, చింతలాయిపల్లె గ్రామాలకు చెందిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చొరవతో చేతిపంపు స్థానంలో ఏర్పాటు చేసిన మోటార్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టాలు పొందిన ప్రతి లబ్ధిదారుడు గృహ నిర్మాణం చేపట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కాలనీల్లో రోడ్లు, విద్యుత్,మంచినీటి సౌకర్యం కల్పిస్తుందని, బిల్లుల మంజూరులో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరాముడు, ఎంపీడీఓ సుబ్బరాజు, తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, హౌసింగ్ ఏఈ మద్దిలేటి, ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏఈ ఫక్కీరయ్య, ఈఓఆర్డీ తాహీర్ హుసేన్, వైఎస్ఆర్‌సీపీ నేత పేరం సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతి కుమార్

బేతంచెర్ల: రోడ్డు నిబంధనలు పాటించి ప్రమదాల నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్, బేతంచెర్ల సీఐ ప్రియతం రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని రోడ్డు భద్రతపై ఆటో, ట్రాక్టర్, లారీ, టాక్సీ డ్రైవర్లు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో సీటు బెల్టుపెట్టుకోవాలని సూచించారు. అనంతరం పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మద్దిలేటిస్వామి, అధ్యక్ష, కార్యదర్శులు జశ్వంత్ రెడ్డి, సునీల్ కుమార్, సభ్యులు సత్తార్, గుండా గోపాలు, విజయ నాగరాజు,వీరారెడ్డి, లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యాగంటి క్షేత్రాన్ని దర్శించుకున్న ప్రముఖులు

బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి క్షేత్రాన్ని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డితో పాటు తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేంద్ర వేర్వేరుగా స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, అర్చకులు మహేశ్వరమ్మ ఆధ్వర్యంలో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కొలువైన శ్రీ ఉమామహేశ్వరస్వామికి అభిషేకం అర్చన తదితర పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ సంప్రదాయం మేరకు అర్చకులు ఎమ్మెల్యేలను పూలమాలు, దుశ్శాలువాలతో సన్మానించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుడ్డాశ్రీకాంత్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎంపీపీ, నగరపంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బాబుల్ రెడ్డి, ఖాజా హుసేన్ తెలిపారు. శనివారం పట్టణంలోని బైటిపేట కాలనీల్లో కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలోగడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, నగర పంచాయతీ వైఎస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ రంగస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి వారు కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో రూ. 330 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వాటర్ గ్రిడ్ పథకం కింద రానున్న రోజుల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ ఇవ్వడమే కాకుండా పరిశుభ్రమైన నీరు అందజేస్తామన్నారు. ప్రతి కాలనీకి మౌలిక వసతులు కల్పించి పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో మండల, పట్టణ సచివాలయ కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, అజామ్, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, శేఖరయ్య, బుగ్గన కుమార్‌రెడ్డి, మురళీకృష్ణ, తిరుమలేష్, రామాంజనేయులు, బూషిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రంగు పుల్లయ్య, భాస్కర్‌రెడ్డి, పవన్, సలీమ్, ఖాజా, నాగేశ్వరరావు, శేఖర్‌రెడ్డి, దస్తగిరి, రంగస్వామి, రామనాయుడు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలి

గ్రామ సచివాలయ కన్వీనర్లు బాధ్యతగా పనిచేసి సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు మూర్తుజావలీ, నాయకులు బుగ్గన చంద్రా రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల, పట్టణ సచివాలయ కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాల్సిన బాధ్యత కన్వీనర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

24న మంత్రి బుగ్గన రాక

బేతంచెర్ల: మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు ఈ నెల 22న రావాల్సి ఉందని, అనివార్య కారణాల మూలంగా 24న వస్తున్నారని వేంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ మద్దిలేటి శనివారం తెలిపారు. ట్టణంలోని గొరిపేటలో వెలసిన చెన్న కేశవ, ఆంజనేయ, వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వినాయక, వేణుగోపాల స్వామి, మాధవ స్వామి, ఉత్తర ద్వార పునర్నిర్మాణంతో పాటు కాలక్షేప మండప నిర్మాణానికి 24వ తేదీన మంత్రి భూమి పూజ చేస్తారన్నారు. 22వ తేదీన బాళఆలయం (కళాకర్షణ) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలు నేరం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం,పేండేకల్లు పంచాయతీ మజార గ్రామమైన వెంకటగిరిలో బాల్య వివాహాల నష్టంపై శనివారం సీడీపీఓ ఉమా మహేశ్వరి, మహిళా పోలీసు అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన ఓ యువకుడికి, బనగానపల్లె మండలానికి చెందిన బాలికతో ఈనెల 26న వివాహం ఉన్నట్లు సమాచారం అందుకున్న సీడీపీఓ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు నేరమని, నిబంధనలకు విరుద్ధంగా కల్యాణం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీడీపీఓ హెచ్చరించారు.

అన్నదాన సత్రం ఉపాధ్యక్షుడిగా జోన్నలగడ్డ శ్రీను

డోన్ టౌన్: ఆంధ్రప్రదేశ్‌లో ఏకైక అతి ప్రాచీన సరస్వతి మాత దేవి క్షేత్రమైన శ్రీకొలను భారతిలో ఉన్న శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్య అన్నదా న సత్రం ఉపాధ్యక్షుడిగా డోన్ పట్టణ నివాసి, న్యాయవాది జోన్నలగడ్డ శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన సర్వ సభ్య సమావేశంలో శ్రీనెను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు స్థానిక కోర్టు ఆవరణలో శనివారం ఆయనను న్యాయవాదులు రామలింగం, గార్లపాటి మద్దిలేటి, ఖాసీంసాహెబ్, ఆంజనేయ గౌడ్ తదిరతుల ఆధ్వర్యంలో అభినందన కార్య క్రమం నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీ మద్దిలేటయ్య ఆదాయం రూ.2,72,200

బేతంచెర్ల : మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివార్లో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయానికి పుష్యమాసాన్ని పురస్కరించుకుని శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండదీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.2,72,200 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ నాయుడు, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుకుల పాఠశాల వార్షికోత్సవం

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని గురుకుల పాఠశాలలో ఆదివారం సాయంత్రం పాఠశాల వార్షికోత్సవం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ పిర్దోస్ అంజుమ్ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినులతోపాటు తల్లిదండ్రులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎరువుల విక్రయాలునిలిపివేత


రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ సుబ్బారెడ్డి

బనగానపల్లెరూరల్: పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ఉన్న శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తనిఖీ చేశారు. యూరియా, డీఏపీ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు మండల రైతు సంఘం నాయకులు శుక్రవారం ఫిర్యాదు మేరకు తనిఖీ చేస్తున్నట్లు ఏఓ సుబ్బారెడ్డి తెలిపారు. దుకాణంలో ఉన్న స్టాక్ రిజిస్టర్, ఎరువుల వివరాలను పరిశీలించారు. దీంతో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, ఫ్యాక్టు, ఇఫ్కో కంపెనీ ఎరువుల విక్రయాలకు సంబంధించి లైసెన్స్ ఫారం జతపరచకపోవడంతో విక్రయాలు నిలిపివేయాలని ఆదేశించారు. రైతులు కూడా యూరియా అవసరం ఉంటే రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలని, యూరియా అందుబాటులో ఉందని ఏఓ తెలిపారు. తనిఖీ మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు జరిగింది. కార్యక్రమంలో ఏఈఓ ఓబులేసు,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

డోన్ రూరల్ : మండల పరిధిలోని కొచ్చెర్వు గ్రామం సమీపంలోని సుంకులమ్మ గుడి వద్ద శుక్రవారం రాత్రి 2గంటల సమయంలో ఆటో బోల్తాపడి ప్యాపిలి మండలం, గుడిపాడు గ్రామానికి చెందిన చాకలి నరసింహులు(52) మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుడిపాడు గ్రామానికి చెందిన నరసింహులు, లక్ష్మిరంగయ్య సొంతపని మీద డోన్‌కు వచ్చారు. రాత్రి తిరిగి స్వగ్రామానికి ఏపీ21టీవై7713నంబర్ ఆటోలో వెళ్తుండగా కొచ్చెర్వు గ్రామం సుంకులమ్మ గుడి వద్ద ఆటో బోల్తా పడింది. గాయపడిన వారిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా నరసింహులు అప్పటికే మృతి చెందాడు. లక్ష్మిరంగయ్యకు తీవ్రంగా గాయాలు కావడంతో డాక్టర్లు పరిశీలించి కర్నూలుకు రెఫర్ చేశారు. ఆటో డ్రైవర్‌కు చాకలి మధుకు ఎటువంటి గాయాలు తగలలేదు. పోస్టుమార్టం అనంతరం నరసింహులు మృతదేహన్ని బంధవులకు అప్పగించారు. మృతునికి భార్య చాకలి లక్ష్మిదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

ప్రయాణికుడి మృతి

స్థానిక రైల్వేస్టేషన్‌లో శనివారం రామేశ్వరం నుంచి ఓకా ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తున్న రైలులో ప్రయాణిస్తున్న గుజరాత్ రాష్ట్రంలోని గాంధీపురం గ్రామానికి చెందిన మానహర్‌లాల్ భడార్కా(55) గుండెపోటుతో మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. రామసేతును దర్శించుకుని రైలులో తిరిగి వస్తుండగా డోన్ రాగానే గుండెపోటు వచ్చి మృతి చెందాడన్నారు. మృతుని స్నేహితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్


విజేత జట్టు సభ్యులకు నగదు అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: మండల పరిధిలోని ఉడుములపాడులో నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, దివంగత టీఏ పద్మానాభరెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శనివారం ముగిశాయి. ప్రథమ స్థానంలో వెల్దుర్తి మండలం సూదేపల్లెకు చెందిన మధుకృష్ణ జట్టు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉడుములపాడు దస్తగిరి ఎస్సీ టీం, పట్టణానికి చెందిన ప్రభాకర్ జట్లు నిలిచాయి. విజేత జట్లకు వరుసగా రూ. 20వేలు, రూ.10వేలు, రూ. 5వేలను గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు బండి నాగమద్దయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ పోటీలకు ఎమ్పీటీసీ సభ్యురాలు టీఏ సుమిత్రమ్మ సహకారం అందజేశారని నిర్వాహకులు తెలిపారు.

ఉగాదికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకంలో మంజూరైన పక్కాగృహాల నిర్మాణాలను ఉగాది పండగ నాటికి పూర్తి చేయాలని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి సూచించారు. శనివారం పట్టణ శివారులోని ఎస్సార్బీసీ జగనన్న కాలనీలో నిర్మితమవుతున్న గృహ నిర్మాణాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు సొంతింటి కలను సాకారం చేసుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోతే నోటీసులు జారీ చేసి ఇంటి పట్టాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధిక, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి

కోవెలకుంట్ల: వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏఓ నిరంజన్ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని సౌదరదిన్నెలో పప్పుశనగ పంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఏఓ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేస్తున్న విత్తనాలు, రసాయన ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయశాఖ అసిస్టెంట్ శశిరేఖ, రైతులు పాల్గొన్నారు.

అధికారుల సలహాలు పాటించాలి

డోన్ రూరల్ : సాగులో వ్యవసాయ, ఉద్యాన అధికారుల సలహాలు పాటించాలని, అప్పుడే దిగుబడులు బాగుంటాయని ఉద్యాన శాఖ అధికారి కళ్యాణి తెలిపారు. ఓబులాపురం గ్రామంలో శనివారం మామిడిలో తోటబడి కార్యక్రమం నిర్వహించారు. మామిడి పూత, మొగ్గ దశలో ఎక్కువగా తేనే మంచు పురుగు ఆశిస్తుందని, నివారించేందుకు ఇమీడా క్లోరిప్రిడ్‌ను పిచికారీ చేయాలని ఈ సందర్భంగా ఆమె రైతులకు సూచించారు. అదేవిధంగా చనుగొండ్ల, ఇంద్రాంపల్లి గ్రామాలలో రైతులు బిందు సేద్యంతో చేసిన పంటలను ఆమె పరిశీలించారు.